చెరువు విస్తీర్ణం నిర్ధారణ సర్వే

చౌటుప్పల్, న్యూస్‌టుడే: హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలోని చౌటుప్పల్ మండలంలోని చెరువులు, కుంటల్లో జిల్లా కలెక్టర్ ఆదేశంతో సర్వే కొనసాగుతోంది. పురపాలిక పరిధి తాళ్లసింగారంలోని గండికుంట, నేలపట్లలోని ఆంబావికుంటలను నీటి పారుదల శాఖ డీఈ రాజవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, సర్వే శాఖ ఏడీ మధుల ఆధ్వర్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు. నేలపట్లలో సర్వేతీరును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువుల సరిహద్దులు నిర్ణయించాలని సూచనలిచ్చారు. మండల పరిధిలో 37 చెరువులున్నాయి. ఇప్పటి వరకు పది చెరువులను సర్వే పూర్తి చేశారు. రికార్డుల ప్రకారం ఆ చెరువు విస్తీర్ణం, పూర్తి స్థాయిలో నిండితే ఎక్కడివరకు నీళ్లొస్తాయని (ఎఫ్‌టీఎల్) గుర్తిస్తున్నారు. పదెకరాల లోపు విస్తీర్ణమున్న చెరువులకు ఎఫ్‌టీఎల్ నుంచి తొమ్మిది మీటర్ల దూరం వరకు, 25 ఎకరాల విస్తీర్ణమున్న చెరువులకు 30 మీటర్ల దూరం వరకు బఫర్ జోన్‌గా నిర్ధారిస్తున్నారు. ఆ తర్వాత ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఏఏ సర్వే నెంబర్లలో ఎవరున్నారని జాబితాలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపుతున్నామని ఐబీ డీఈ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు.



తాళ్లసింగారం గండికుంటను సర్వే చేస్తున్న అధికారులు

షెడ్యూల్ వచ్చేసింది!

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే




వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి పూర్తి కానుండడంతో.. తదుపరి ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా రూపొందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూలు విడుదల చేసింది. ఈ నెల 30 నుంచి ఓటు నమోదుకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఫారం-19 ద్వారా ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో ceotelangana.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీనికి సంబంధించి అక్టోబరు 16, 25 తేదీల్లో ఎన్నికల అధికారులు ప్రకటనలు జారీ చేయనున్నారు. గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని ఎన్నికల సంఘం సూచించింది.

ఇదీ షెడ్యూల్..

వరంగల్- ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు కార్యక్రమం ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుండగా.. నవంబరు 6 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. నవంబరు 23న ముసాయిదా జాబితా ప్రకటించి.. ఈ జాబితాపై అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 25 వరకు అభ్యంతరాలను పరిష్కరించి.. అదే నెల 30న ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నారు.



గత ఎన్నికల్లో 7,243 మంది ఓటర్లు..

గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 7,243 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 4,737 మంది, మహిళలు 2,505 మంది, థర్డ్ జెండర్ ఒకరు ఉన్నారు.

★ నల్గొండ పట్టణంలో అత్యధికంగా 1,667 మంది ఓటర్లు ఉండగా.. రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత స్థానంలో సూర్యాపేటలో 880 మంది, మిర్యాలగూడలో 788 మంది, కోదాడలో 466 మంది, భువనగిరిలో 306 మంది, దేవరకొండలో 229 మంది, నకిరేకల్‌లో 217 మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

★ అన్ని మేనేజ్‌మెంట్ల ప్రభుత్వ పాఠశాలలు, అన్ని రకాల కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు సైతం ఓటు నమోదుకు అర్హులు.

ఉమ్మడి జిల్లాలో 2019లో ఉన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
నల్గొండ	30	2,488	1,370	1	3,859
సూర్యాపేట	22	1,467	689	0	2,156
యాదాద్రి	16	782	446	0	1,228

సన్నాల సందడి..!

హుజూర్‌నగర్, కోదాడ, న్యూస్‌టుడే:

ప్రభుత్వం సన్నరకాల కొనుగోళ్లకు సిద్ధమవుతోంది. త్వరలో తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి తోడు ప్రభుత్వం సన్నరకాల ధాన్యం పండించిన వారికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని గతంలోనే ప్రకటించింది. దీంతో రైతులు గతంలో కంటే సన్న రకాల ధాన్యం అధికంగా సాగు చేశారు.

★ ఉమ్మడి జిల్లాలో 5,59,497 ఎకరాలలో సన్నరకాలు సాగు చేయగా.. అందులో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పోటాపోటీగా జరిగింది. ఉమ్మడి జిల్లాలో సన్నరకాల ధాన్యం 13,43,756 మెట్రిక్ టన్నులు పండుతుందని అంచనా వేస్తున్నారు. దాదాపు 4.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే అవకాశం ఉంది. పెరిగిన ప్రభుత్వ అవసరాల దృష్ట్యా ఇంకా ఎక్కువ కూడా కొనుగోలు చేసేందుకు అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.




హుజూర్‌నగర్: కోసిన తరువాత ఆరబెడుతున్న సన్నరకం ధాన్యం (పాత చిత్రం)


అంచనాలకు మించి..

వానాకాలం సీజన్‌లో పండే ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళిక ప్రకారం ప్రభుత్వం ముందుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 904 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 394 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 471 పీఏసీఎస్, మరో 45 ఇతర కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అంచనాలకు మించి కొనుగోళ్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు.


ఉమ్మడి జిల్లాలో సాగు వివరాలు (ఎకరాల్లో)



ధాన్యం దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)



కొనుగోళ్ల అంచనాలు (మెట్రిక్ టన్నుల్లో)



ధాన్యం సేకరణకు తాత్కాలిక ప్రణాళిక ఖరారు

భువనగిరి, న్యూస్‌టుడే: వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు ప్రారంభించింది. తాత్కాలిక ప్రణాళికను రూపొందించారు. ధాన్యం దిగుబడి అంచనా.. కొనుగోలు కేంద్రాలు.. రవాణా.. ధాన్యం నిల్వకు అవసరమయ్యే గోదాంలు, ఎలక్ట్రికల్ కాంటాలు, టార్పాలిన్లు, ఏ నెలలో ఎంత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందో నెల వారి అంచనాల వివరాలను రూపొందించి తాత్కాలిక ప్రణాళికను ఉన్నతాధికారులకు సమర్పించారు. వ్యవసాయ శాఖ ఇచ్చిన సమాచారం మేరకు సాగు చేసిన వరి పైరు, దిగుబడుల అంచనాలను పేర్కొన్నారు. వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో సుమారు 2,53,543 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. వీటిలో సన్న రకాలు 31,984 ఎకరాలు కాగా, దొడ్డు రకం 2,27,559 ఎకరాలు ఉన్నాయి. సన్న రకాలు 70,364 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 5,46,143 ఎంటీలు, మొత్తం 6,16,507 ఎంటీల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రైతుల అవసరాలు, మిల్లర్లు నేరుగా కొనుగోలు చేయగా సన్నాలు 32,364 ఎంటీలు, ఇతర రకాలు 3,67,636 ఎంటీలు మొత్తం 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు వస్తాయన్న అంచనాతో ఏర్పాట్లతో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 52 రైస్ మిల్లులకు సీఎంఆర్‌కు ధాన్యం ఇవ్వడానికి ఎంపిక చేశారు. స్థలాభావం ఉంటే గతంలో మాదిరిగానే పొరుగు జిల్లాలకు ధాన్యం కేటాయిస్తారు.

అక్టోబరులో కొనుగోళ్లు

అక్టోబరు నెల కొనుగోలు ధాన్యం కొనగోళ్లకు సిద్ధంగా ఉండాలని పౌర సరఫరా అధికారులు సన్నద్ధమవుతున్నారు. అదే నెల 10 నుంచి మార్కెట్లు, కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నారు. వర్షాలు ఆలస్యంగా పడటంతో జిల్లాలో ఆగస్టు చివరి వారం వరకు వరి సాగు చేశారు. దీంతో వరి కోతలు ఆలస్యంగా జరిగే అవకాశం ఉంది. అక్టోబరు నెలలో 12,234, నవంబర్ నెలలో 2.70 లక్షలు, డిసెంబరు నెలలో 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు అవసరమయ్యే గోనె సంచులు సిద్ధం, ఇతర సామగ్రిని పౌర సరఫరా సంస్థ సిద్ధం చేసుకుంటుంది. ప్రస్తుతం ఉన్నవి పోను కొత్తవి 46 లక్షల గన్నీ సంచులు అవసరమని గుర్తించి కొనుగోలు చేయాలని ఉన్నత అధికారులకు లేఖ రాశారు. గతంలో మాదిరిగానే ఐకేపీ, పీఏసీఎస్, ఎఫ్‌పీవోల ద్వారా కొనుగోళ్లు చేయాలని, మొత్తం 323 కొనుగోలు కేంద్రాలు తెరవాలని ప్రతిపాదించారు. ఈ సారి సన్న, సాధారణ రకాలు కొనుగోళ్లకు విడివిడి కొనుగోలు కేంద్రాలు తెరవాలని ప్రభుత్వం నిర్ణయించినా, జిల్లాలో ఆ మేరకు ఏర్పాట్లు చేయలేదు.

ప్రతిపాదనలు ఇలా...

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం: 2,59,543 ఎకరాలు

సన్నాల విస్తీర్ణం: 31,984 ఎకరాలు

ఇతర రకాల సాగు : 2,27,559 ఎకరాలు

దిగుబడి అంచనా: సన్నాలు: 70,364 ఎంటీలు

ఇతర రకాలు : 5,45,143 ఎంటీలు

కొనుగోలుకు వచ్చేవి: సన్నాలు: 32,363

ఎంటీలు, ఇతర రకాలు : 3,67,636

ఎంటీలు మొత్తం: 4లక్షలు

ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాలు : 323

ఐకేపీ: 90 | పీఏసీఎస్: 220

ఎఫ్‌పీవోలు: 13 | జిల్లాలోని మిల్లులు: 52

రా రైస్ మిల్లులు: 11

బాయిల్డ్ రైస్ మిల్లులు: 41

ధాన్యం మార్కెట్‌కు రాక అంచనా: వచ్చే అక్టోబరు 10వ తేది నుంచి

మరింత వేగవంతంగా ధరణి సేవలు

భువనగిరి, న్యూస్‌టుడే: ధరణి సేవలను రైతులకు మరింత వేగవంతంగా అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భూ సమస్యలను పారదర్శకంగా, ప్రమాణాలతో పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాను బాధ్యతలు చేపట్టే నాటికి 13 వేల దరఖాస్తులు ధరణిలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 4 వేలకు కుదించామన్నారు. 7,800 దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 4,700 దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మరో నాలుగు వారాల్లో పరిష్కరిస్తామన్నారు. గ్రామీణ జిల్లాలతో పోల్చుకుంటే యాదాద్రి జిల్లాలో దరఖాస్తుల పరిష్కారం వేగవంతంగా సాగుతుందన్నారు. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. మండల కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించాల్సిన సుమారు 1800 పిటిషన్లపై ప్రత్యేక దృష్టి పెడతామని, మండల రెవెన్యూ కార్యాలయాల్లో తనిఖీలు చేసి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

యాదాద్రిలో శాస్త్రోక్తంగా కల్యాణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: స్వయంభూ క్షేత్రమైన యాదాద్రి పంచనారసింహస్వామి స్వయంభూ క్షేత్రంలో మంగళవారం నిత్య, సంప్రదాయ ఆరాధనలు ఆలయ శాస్త్రరీత్యా కొనసాగాయి. ఆలయ మూలవరులకు నిజాభిషేకం, తులసీ అర్చన, క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను హారతితో కొలిచారు. పంచామృతంతో అభిషేకం చేపట్టారు. దర్శనమూర్తులను బంగారు పుష్పాలతో ఆరాధించారు. ఆలయ మహాముఖ మండపంలో స్వర్ణ పుష్పార్చన, అష్టభుజి మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం నిర్వహించారు. సాయంత్రం అలంకార జోడు సేవోత్సవం చేపట్టారు. రాత్రివేళ గర్భాలయంలో ప్రత్యేక ఆరాధన సహస్రనామార్చన నిర్వహించారు. ఉపాలయంలో క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామి వారికి వేద, మంత్రాలతో తమలపాకులతో ఆస్థానపరంగా ఆరాధించారు. ఆర్జిత కైంకర్యాన్ని విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆకుపూజ చేపట్టారు. సహస్రనామార్చన జరిపారు. శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల ఆరాధనలను ఆలయ ఆచారంగా కొనసాగించారు. పాతగుట్టలోనూ శ్రీలక్ష్మీనరసింహస్వామిని కొలుస్తూ నిత్య పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ తమలపాకులతో ప్రత్యేక అర్చన జరిపారు.



ఆలయంలో కల్యాణ సేవా పర్వం

వసతులు మెరుగు పరచాలి: జడ్జి

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: భువనగిరిలోని బాల సదన్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవీలత మంగళవారం సందర్శించారు. బాల సదన్‌లో ఉన్న బాలికలు వివరాలను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. బాలికలకు అందిస్తున్న వసతులు, చదువు, ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ఇబ్బందులు లేకుండా వసతులు మెరుగుపర్చాలని పలు సూచనలు చేశారు.



బాల సదన్‌లో వివరాలు తెలుసుకుంటున్న జడ్జి మాధవీలత

జిల్లాలో మళ్లీ వర్షాలు

భువనగిరి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో మంగళవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. ఒక మాదిరి నుంచి అక్కడక్కడ భారీ వర్షాలు నమోదయ్యాయి. మోత్కూరు, గుండాల మండలాల్లో భారీ వర్షం నమోదైంది. మోత్కూరు మండలం దత్తప్పగూడెంలో 81.3, గుండాలలో 67.5, అడ్డగూడూరులో 66.3, చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలో అత్యధికంగా 62.3 మి.మీ, రాజపేటలో 59.3, తుర్కపల్లిలో 40.5, ఆత్మకూర్‌లో 37.5, ఆలేరులో 35.5, మోటకొండూరులో 27.3, యాదగిరిగుట్టలో 27, బొమ్మలరామారంలో 22.3, బీబీనగర్ 22.3, భువనగిరిలో 21.8 మి.మీ, పోచంపల్లి 12.5 వర్షపాతం నమోదైంది.

వృక్షాలు దైవంతో సమానం: కమాండెంట్ త్రినాథ్

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: మొక్కగా జీవం పోసుకున్న నాటి నుంచి తన చివరి దశ వరకు వృక్షాలు నిరంతరం కాలుష్యంతో పోరాడి జీవ కోటికి స్వేచ్ఛా వాయువులను ప్రసాదిస్తాయని, చెట్లను దైవంగా భావించే గొప్ప సంస్కృతి కలిగిన దేశం మన భారత్ అని టీజీ ఎస్పీఎఫ్ కమాండెంట్ ఎన్.త్రినాథ్ వ్యాఖ్యానించారు. యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ పరిధిలోని గోశాలలో సోమవారం టీజీ ఎస్పీఎఫ్ (తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఆలయ ఈవో భాస్కర్ రావు, ఛైర్మన్ నరసింహమూర్తిలను ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ.. వృక్షాలు మానవాళికి ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నప్పటికి మానవుడి తన స్వార్థపూరిత, అనాలోచిత విధానాలతో రోజురోజుకు అవి తరిగిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఫలితంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతిని భూగోళం మండిపోతుందన్నారు. మొక్కల పెంపకం ద్వారా కలిగే లాభాలను, వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ డీఆర్ఎల్ రాజు, ఆలయ డీఈవో భాస్కర్‌శర్మ, ఎస్పీఎఫ్ సీఐ శేషగిరిరావు, పట్టణ సీఐ రమేష్, ఎస్సైలు, ఎస్పీఎఫ్ సిబ్బంది, హోంగార్డు సిబ్బంది, ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చుట్టూ నీరు... ఆలేరులో కన్నీరు



ఆలేరు: గుండ్లగూడెం శివారులో వెలవెలబోతున్న వాగు

ఆలేరు మండలంలో చాలావరకు నీటి వనరులు వెలవెల బోతున్నాయి. సాధారణ వర్షపాతం నమోదైందని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. కొన్ని కుంటలు, చెరువుల్లోకి 25 శాతం వరకు నీరు చేరింది. కొన్ని కుంటల్లోకి మాత్రం చుక్కనీరు చేరలేదు. కిందటేడాది ఆగస్టు చివరి కల్లా చెరువులు, కుంటలు నిండాయి. ఆలేరు, కొలనుపాక, రాఘవపురం, మంతపురి వాగులు ఆగస్టు నుంచి అక్టోబరు రెండోవారం వరకు నీటితో ప్రవహించాయి. 2023 వానాకాలం సీజన్‌తో పోల్చితే ప్రస్తుత ఏడాది వానాకాలం సీజన్‌లో సుమారు 950 ఎకరాల్లో వరి పంట తక్కువగా సాగైందని మండల వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు కురిసిన వర్షాలు పత్తి, కంది, పెసర, జొన్న పంటలకు మాత్రమే జీవం పోశాయి.

\- ఆలేరు, న్యూస్‌టుడే

ఉపాధ్యాయులు గుణాత్మక విద్య బోధించాలి: కలెక్టర్


వలిగొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు నాణ్యమైన గుణాత్మక విద్యా బోధనను ఉపాధ్యాయులు అందించాలని కలెక్టర్ హనుమంతు కె జెండగే సూచించారు. మండలంలోని టేకులసోమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి మాట్లాడారు. తరగతి గదుల్లో విద్యార్థులను పాఠాలు చదివించారు. ప్రతి విద్యార్థి మానసికంగా, శారీరకంగా ఎలాంటి ఒత్తిడి లేకుండా పుస్తకం చదివే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. మధ్యాహ్నం భోజనం, విద్యార్థుల మౌలిక వసతులు, ఉపాధ్యాయుల బోధనపై బాల బాలికలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి విద్యార్థి పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, ఎంపీవో కేదార్‌ఈశ్వర్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



వలిగొండ: టేకులసోమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంత్ కె జెండగే

గ్రామాల్లో అమృత్ ఫలాలు..!

రాజపేట, ఆలేరు, న్యూస్‌టుడే:



మిషన్ అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చెరువు పూడికతీత పనులను పరిశీలిస్తున్న అధికారులు (పాతచిత్రం)

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించి, భూగర్భ జలాలు పెంపొందించేందుకు మిషన్ అమృత సరోవర్ పథకం కింద చేపట్టిన చెరువుల పూడికతీత పనులు సత్ఫలితాలిస్తున్నాయి. ఈ పథకం కింద జిల్లాలోని 14 మండలాల్లో 76 చెరువులను ఎంపిక చేశారు. ఇందులో 42 చెరువుల్లో పూడికతీత పనులు పూర్తి చేయగా, మిగిలిన 34 చెరువుల పనులు పురోగతిలో ఉన్నాయి. జిల్లాలో పథకం తీరుతెన్నుల విషయమై వివరాలు క్లుప్తంగా..

పద్నాలుగు మండలాల పరిధిలో..

పథకంలో భాగంగా కొత్తగా నీటి కుంటలను తవ్వి నీటి వనరులను నిల్వ చేయాల్సి ఉంది. కుంటల నిర్మాణానికి స్థలాలు అనువుగా లేకుంటే, ఇప్పటికే ఉన్న కుంటలను, చెరువుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పథకంలో వీలు కల్పించారు. ఆ దిశగా అధికారులు కసరత్తు చేసి జిల్లాలోని 14 మండలాల్లో 76 చోట్ల నీటి కుంటలు, చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఉపాధిహామీ, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులను చేపట్టాలని కేంద్రం స్పష్టం చేసింది. ఆ దిశగానే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కేంద్రం రూపొందించిన నిబంధనల ప్రకారం చెరువులను ఎంపిక చేసి పనులను చేపట్టారు. ఈ పథకం పనుల వల్ల ఉపాధి కూలీలకు అదనంగా పని దొరికే అవకాశం ఏర్పడింది.

జలమట్టం పెంపునకు దోహదం:

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, యాదాద్రి

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని మిషన్ అమృత్ సరోవర్ పథకం కింద జిల్లాలో మొత్తం 76 పనులను ఎంపిక చేశాం. అందులో సగానికిపైగా పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు పురోగతిలో ఉన్నాయి. ముఖ్యంగా ఈ పథకం కింద చేపట్టే చెరువుల పూడికతీత పనులతో కూలీలకు ఉపాధి లభించడంతోపాటు భూగర్భ జలమట్టం పెంపునకు అవకాశం ఏర్పడుతుంది.

యాదాద్రి భువనగిరి జిల్లాలో పథకం తీరు తెన్నులు:

మండలం	పురోగతిలో ఉన్నవి	పూర్తి చేసినవి
ఆలేరు	2	3
ఆత్మకూర్(ఎం)	3	2
భువనగిరి	3	2
బీబీనగర్	2	2
బొమ్మలరామారం	4	2
చౌటుప్పల్	4	2
తుర్కపల్లి	2	2
మోత్కూరు	2	4
సంస్థాన్‌నారాయణపురం	-	14
భూదాన్ పోచంపల్లి	1	1
రాజపేట	2	3
రామన్నపేట	3	3
వలిగొండ	2	1
యాదగిరిగుట్ట	4	1

భావిపౌరులు... బలహీనమై..!

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: యాంత్రిక జీవన విధానంలో పడి తల్లిదండ్రులు పిల్లలకు సరైన పోషణ అందుతుందో, లేదో కూడా పట్టించుకోలేకపోతున్నారు. వెరసి చిన్నారుల వయసుకు తగ్గట్టుగా పోషకాలు అందడంలేదు. పట్టుమని 10 శాతం పిల్లలు కూడా పూర్తి పోషణతో ఉండడంలేదన్నది సర్వేలు చెబుతున్న వాస్తవం. ప్రధానంగా విటమిన్ ఎ, డి, ఐరన్ లోపంతో ఎక్కువగా బాధపడుతున్నారని కేంద్ర కుటుంబ, ఆరోగ్య మంత్రిత్వ శాఖ సర్వే నివేదిక పేర్కొంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరును 'పోషణ అభియాన్ మాసం'గా గుర్తించి అవగాహన కల్పిస్తుంది.

☛ అడవిదేవులపల్లి పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థి సాయంత్రం 4 గంటల తర్వాత కళ్లు తిరిగి కింద పడిపోయాడు. తల్లిదండ్రులు వైద్యం కోసం తీసుకెళితే..అబ్బాయి చాలా బలహీనంగా ఉన్నాడని.. రోజూ పోషకాలతో కూడిన భోజనం అందించాలని సూచించారు.

☛ మిర్యాలగూడ పట్టణానికి చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలిద్దరూ రోజూ నీరసంగా ఉంటున్నారని వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. పిల్లలు రోజూ కాళ్లు, చేతులు లాగుతున్నాయంటున్నారని.. వారికి ఏదైనా టానిక్ రాసివ్వండని అడిగారు. ప్రస్తుతం ఇలాంటి ఘటనలు వైద్యుల వద్ద సాధారణమైపోయాయి.



అడవిదేవులపల్లిలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థినులు (పాత చిత్రం)

రోజూ భోజనంలో ఇవి తప్పనిసరి

- పసుపు, నారింజరంగు కూరగాయలు, ఆకుకూరలు
- గుడ్లు లేదా మాంసం
- పాలు, రాగి జావ
- తాజా పండ్లు, మొలకెత్తిన విత్తనాలు, డ్రైఫ్రూట్స్

సరైన పోషణ అందకపోతే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా **3,209** ప్రభుత్వ పాఠశాలల్లో **2,11,009** మంది విద్యార్థులు చదువుతున్నారు.

మూడో వంతు **70,336** మంది చిన్నారులు రక్తహీనతతో బాధపడుతున్నారు.

విటమిన్ లోపంతో **30000** మందిని కంటి సమస్యలు బాధిస్తున్నాయి.

రక్తహీనత కారణంగా నీరసం, తరచూ జ్వరంతో బాధపడుతూ చిగుళ్లవాపు, ఎముకల నొప్పుల వంటి సమస్యలు వేధిస్తున్నాయి. పాఠ్యాంశాలపై శ్రద్ధ చూపలేకపోతున్నారు.

వీరికి సరైన పోషకాలతో కూడిన ఆహారం అందించడం తల్లిదండ్రుల బాధ్యత.

వయసుల వారీగా పిల్లలకు కావాల్సిన పోషకాలు (గ్రాముల్లో)

వయసు	ప్రొటీన్లు	కొవ్వులు	కాల్షియం	ఐరన్(మి.గ్రా.)	క్యాలరీలు(శక్తి)
2-3	17.7	27	0.6	9	1,060
4-6	20.1	25	0.6	13	1,350
7-9	29.5	30	0.6	16	1,690
10-12	39.9	35	0.8	21	2,190
13-15	54.3	45	0.8	28	2,750

సమతుల ఆహారమందించాలి..: ఎస్‌డీ.అజహర్ అహ్మద్, ఎంవో, పీహెచ్‌సీ, అడవిదేవులపల్లి



పిల్లలకు ఇచ్చే ఆహారంలో కార్బోహైడ్రేట్లు 60 శాతం, పిండిపదార్థాలు 10 శాతం, కొవ్వు 30 శాతం పదార్థాలతో పాటు పీచు పదార్థాలు, విటమిన్లు ఉండే ఆకు కూరలతో కూడిన సమతుల ఆహారం ఇవ్వాలి. అరికెలు, సామలు, కొర్రలు, రాగులు వంటి చిరుధాన్యాలను అలవాటు చేయాలి.



వేరుసెనగ వైపు అడుగులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: యాసంగిలో వేరుసెనగ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ సారి వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఆయకట్టేతర ప్రాంతాల్లో వరినాట్లు వేయలేకపోయారు. ఆగస్టు చివరి నుంచి కురిసిన వానలకు జల వనరులు కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంది. దీంతో మరో పది రోజుల్లో వేరుసెనగ సాగు పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. బీడు భూముల్లో చెత్తాచెదారం తొలగించి దుక్కులు దున్నుతున్నారు.

200 క్వింటాళ్ల విత్తనాలు విక్రయం

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 200 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు విక్రయించారు. విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలు దొరకని రైతులు బయటి మార్కెట్‌లో సేకరించుకుంటున్నారు. ఎకరా సాగుకు సుమారు 80 నుంచి 85 కిలోల పల్లీవిత్తనాలు అవసరం. ప్రభుత్వం ఐదేళ్లుగా రాయితీ ఇవ్వకపోవడంతో రైతులకు విత్తన పెట్టుబడి భారంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో 13,500 ఎకరాల్లో..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో యాసంగిలో 13,500 ఎకరాల్లో వేరుసెనగ సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. నల్గొండ జిల్లాలో ఎక్కువగా దేవరకొండ, డిండి, మర్రిగూడ, గుర్రంపోడు, నల్గొండ, పెద్దవూర, పీఏపల్లి, చింతపల్లి, గుండ్లపల్లి మండలాల్లో ఎక్కువగా సాగవుతుందని భావిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో తిరుమలగిరి, ఆత్మకూర్(ఎస్), తుంగతుర్తి, మోతె, నాగారం, నూతనకల్ మండలాల్లో పల్లీలు పండించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎక్కువ మండలాల్లో వేరుసెనగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పల్లీ సాగుకు అనుకూలం: శ్రవణ్‌కుమార్ జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

యాసంగిలో ఇప్పుడు వేరుసెనగ సాగుకు అనుకూలంగా ఉంది. వర్షాలు కురవడంతో భూముల్లో తడి ఉంది. సాగు పనులకు రైతులు సమాయత్తం కావచ్చు. నల్గొండ జిల్లాలో ఎక్కువగా దేవరకొండ డివిజన్‌లో పల్లీలు సాగు చేస్తారు.

జీవితానికి 'మరమ్మతులు' చేసుకొని..!



మిర్యాలగూడ సబ్ జైలు డిప్యూటీ జైలర్ విష్ణువర్ధన్‌రెడ్డి

తపన ఉండాలే కానీ ఏదైనా సాధించవచ్చని..వాటికెన్ని అడ్డంకులు ఎదురైనా పోరాటం చేయవచ్చని నిరూపించారు మిర్యాలగూడ సబ్‌జైలు డిప్యూటీ జైలర్ బుర్రి విష్ణువర్ధన్‌రెడ్డి. చదివేందుకు ఫీజులు చెల్లించే స్తోమత లేక ఇంటర్మీడియట్‌తోనే చదువు మానేసి.. పదేళ్లపాటు బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ.. దూరవిద్యలో మళ్లీ చదువును కొనసాగించి.. పోటీపరీక్షలు రాసి ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ జైలర్. తన ప్రయాణం గురించి ఆయన వివరించారు.. ' మాది మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని వేములపల్లి మండల కేంద్రం. అమ్మానాన్న జానకిరెడ్డి, అహల్య. ఇంటర్మీడియట్ వరకూ మిర్యాలగూడలోనే చదివి.. అనంతరం హైదరాబాద్‌లో ద్విచక్రవాహన మరమ్మతుల దుకాణంలో చేరా. మెకానిక్ పని చేసుకుంటూనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దూర విద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశా. ఐసెట్‌లో సీటు సాధించి ఎంబీఏ 2013లో పూర్తి చేశాను. 2005 నుంచి 2015 వరకు బైక్ మెకానిక్‌గా పనిచేసినా.. స్నేహితుడి సాయంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. మొదటి ప్రయత్నంలో ఎస్సై పరీక్ష రాయగా ఎంపికవలేదు. ఆ తరువాత నిర్ణీత ప్రణాళికతో కష్టపడి పలు పోటీ పరీక్షలు రాయటంతో పంచాయతీ కార్యదర్శి పరీక్షలో 74వ ర్యాంకు, గ్రూప్-4లో 63వ ర్యాంకు, బిల్‌కలెక్టర్ ఉద్యోగం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించా. పంచాయతీ కార్యదర్శి ఉద్యోగంలో చేరి వేములపల్లి మండలం ఇసుకబాయిగూడెంలో 2019లో విధుల్లో చేరా. కొద్దిరోజులకే డిప్యూటీ జైలర్‌గా ఎంపికయ్యా. తమిళనాడులో శిక్షణ అనంతరం చంచల్‌గూడ, చర్లపల్లి కారాగారాల్లో విధులు నిర్వర్తించి ఇటీవల మిర్యాలగూడకు బదిలీపై వచ్చా. ప్రస్తుతం గ్రూప్-1 పరీక్షలకు సైతం సిద్ధమవుతున్నా.'..అని వివరించారు.

- మిర్యాలగూడ, న్యూస్‌టుడే

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు శివారులోని వెల్లటూరు కాలనీలో బ్రిక్స్ వ్యాపారి తమ్మిశెట్టి వెంకయ్య ఇంట్లో ఈ నెల 19వ తేదీ తెల్లవారుజామున దోపిడీకి పాల్పడిన దొంగల ముఠాలోని ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. నిందితుల నుంచి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ.38 వేల నగదు, నేరానికి వినియోగించిన కారుతోపాటు ఐదు చరవాణిలు, ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వేమవరపు నాగరాజు, వేమవరపు పుల్లారావు, భిక్షాలు, నల్గొండ జిల్లా వాసి రమావత్ మాత్య, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన చిక్కల ఆంజనేయులు, మేళ్లచెరువుకు చెందిన వేముల వెంకటేశ్వర్లు మొత్తం ఆరుగురు ఒక ముఠాగా ఏర్పడి ఈ నెల 19న వెల్లటూరులోని బ్రిక్స్ వ్యాపారి ఇంటి తలుపులు ధ్వంసం చేసి



కీలక సమాచారం అందించిన ఆటో డ్రైవర్ తిరుపతయ్యను అభినందిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, చిత్రంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, తదితరులు

లోనికి ప్రవేశించారు. కత్తులతో బెదిరించి వ్యాపారి వెంకయ్య, అతని ఇద్దరు కుమార్తెలను బెదిరించి వారి ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలతోపాటు రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఏడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. కోదాడ గ్రామీణ సీఐ రజితారెడ్డి తన సిబ్బందితో అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు కారులో వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. విచారించడంతో వెల్లటూరుతో దోపిడీకి పాల్పడినట్లు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. వేముల వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నాడు. ఈ కేసులో కీలక సమాచారం అందించిన ఆటో డ్రైవర్ తిరుపతయ్యను ఎస్పీ సన్మానించారు. కేసు ఛేదనకు కృషిచేసిన అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రజితారెడ్డి, మేళ్లచెరువు, అనంతగిరి, కోదాడ గ్రామీణ, చింతలపాలెం ఎస్సైలు పరమేశ్, నవీన్, అనిల్‌రెడ్డి, సైదిరెడ్డి, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



త్రిపురం సతీష్‌రెడ్డి

మఠంపల్లి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో యువ రైతు ప్రాణాలు కోల్పోయిన ఘటన మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో మంగళవారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపల్లికి చెందిన త్రిపురం సతీష్‌రెడ్డి(36) గత కొన్నేళ్లుగా ఇక్కడ వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేసుకుంటూ కుటుంబంతో ఉంటున్నారు. మధ్యాహ్నం వరకు గొర్రు దున్ని మోటారు వేసేందుకు వెళ్లిన సతీష్‌రెడ్డి స్టార్టర్ వద్ద సగానికి పైగా తెగి ఉన్న తీగను సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను చికిత్స కోసం హుజూర్‌నగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. స్వగ్రామంలో సొంత భూమి లేకపోవడంతో బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం ఈ గ్రామానికి వచ్చిన సతీష్‌రెడ్డికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామాంజనేయులు తెలిపారు.

భార్య చేతిలో భర్త హతం

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతో భర్తను భార్య హతమార్చిన ఘటన సూర్యాపేట మండలంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం హనుమానాయక్ తండాకు చెందిన ధరావత్ కౌసల్య కొంతకాలంగా మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త ధరావత్ సైదా(45) అడ్డు తొలగించుకోవాలని ఈ నెల 17వ తేదీ రాత్రి సమయంలో అతని కణతపై గొడ్డలితో గాయపరిచి హత్య చేసింది. మద్యం మత్తులో తూలి చెక్క బల్ల అంచుపై పడి తీవ్రంగా గాయపడి మృతిచెందినట్లు అందరినీ నమ్మించింది. ఈ హత్యను చిన్న కుమారుడు వినోద్ చూడగా అతడిని బతిమిలాడి బయటకు చెప్పకుండా జాగ్రత్త పడింది. మరుసటి రోజు మృతుడికి అంత్యక్రియలు పూర్తి చేశారు. చిన్నకుమారుడు వినోద్ తల్లితో గొడవపడి విషయాన్ని తన సోదరుడు సాయికుమార్‌కు చెప్పాడు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు గ్రామీణ ఎస్సై బాలునాయక్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు మంగళవారం ధరావత్ కౌసల్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గ్రామీణ సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.



మిలమిల మెరిసిన తారు

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిలో కోదాడ పట్టణంలోని దుర్గాపురం స్టేజీ వద్ద ఏర్పాటైన ఖమ్మం వెళ్లే నూతన రహదారి ఇలా వెలిగిపోతూ కనిపించింది.

- న్యూస్‌టుడే, కోదాడ

ఇక ఆరోగ్య యోగం

నకిరేకల్, న్యూస్‌టుడే: ఉరుకులు.. పరుగుల దైనందిన జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రాధాన్యం పెరుగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ఉపయోగపడే యోగాను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు కొలిక్కివచ్చాయి. ఆయుష్ కేంద్రాలకు అనుబంధంగా గతేడాది జిల్లాలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్లు (ఆరోగ్య స్వస్థత యోగా మందిర్‌లు) తాజాగా సేవలు ప్రారంభించేందుకు కసరత్తు మొదలైంది. వీటిల్లో యోగా శిక్షకుల నియామకానికి ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నెలాఖరుకు నియామకాల ప్రక్రియను పూర్తిచేసే యోచనలో అధికారులున్నారు.



నకిరేకల్‌లో ప్రాంతీయ వైద్యశాల ఆవరణలో ఏడాదిన్నర క్రితం నిర్మించిన ఆయుష్ యోగా మందిర్

మందిర్‌లు ఇలా..

ఉమ్మడి జిల్లాలో ఆయుష్ వైద్య కేంద్రాల్లో ప్రభుత్వం 47 వెల్‌నెస్ సెంటర్ల భవనాలు నిర్మించింది. వీటికి జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా రూ.2.70 కోట్లను వ్యయం చేసింది. ఈ నిధులతో యోగా కేంద్రాల నిర్మాణం చేపట్టారు. గాలి, వెలుతురు వచ్చే విధంగా వీటి నిర్మాణాలున్నాయి.

శిక్షణా తరగతులు...

ఆయుష్ యోగా మందిరాల్లో ఇద్దరు శిక్షకులను ఒక పురుషుడు, మహిళను నియమిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 47 యోగా మందిర్‌లకు 97 మంది శిక్షకులను నియమించనున్నారు. యోగా ధ్రువపత్రాలున్న పురుషునికి నెలకు రూ.8 వేలు, మహిళకు రూ.5 వేల గౌరవ వేతనంతో ఒప్పంద ప్రతిపాదికన శిక్షకులుగా నియమిస్తున్నారు. ఎంపికైన శిక్షకులు(పురుషులు) ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, మహిళలు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. యోగా కేంద్రాలకు వచ్చే స్థానికులకు ఉచితంగా యోగాసనాలు నేర్పించాలి. ఆయుష్ వైద్యులు ప్రజలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

ఉమ్మడి జిల్లాలో మందిరాలు ఇలా..

- ★ నల్గొండ: 21 మందిరాలు: శిక్షకుల సంఖ్య: 42
- ★ సూర్యాపేట: 12 మందిరాలు: శిక్షకుల సంఖ్య 24
- ★ యాదాద్రి : 14 మందిరాలు: శిక్షకుల సంఖ్య: 28

27న ఇంటర్వ్యూలు..

యోగా శిక్షకుల నియామకాల కోసం ఈ నెల 27న నల్గొండలోని ఆయుష్ వైద్యశాల ఆధ్వర్యంలో వాక్- ఇన్- ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాకు చెందిన వారు నల్గొండలోనే ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉంటుంది. ఇంటర్‌పూర్తిచేసి, యోగా ధ్రువపత్రాలు కలిగిన వాళ్లు అర్హులని ఆయుష్ జిల్లా సీనియర్ వైద్యాధికారి డా.నర్సింహరావు తెలిపారు.

సోమ బ్రహ్మచారి



ఆయనో బ్రహ్మ..!

ఆయన ఉలి పడితే.. ఎంతటి నిర్జీవమైన వస్తువులైనా జీవం పోసుకుంటాయి.. చదువు పెద్దగా లేకపోయినా.. కొద్దిగా నైపుణ్యం.. చేసే పనిపై మనసు.. దానికి నిరంతర శ్రమ తోడైతే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు ముంజంపల్లి సోమబ్రహ్మచారి.

★ చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామ పంచాయతీ వెంకటేశ్వరనగర్‌కు చెందిన ఈయన.. ఆలయాలకు కావాల్సిన దేవుళ్ల విగ్రహాలను తయారు చేయడంతో పాటు రేగు గింజ సైజులో వివిధ రూపాలను చెక్కుతూ ప్రతిభను



చూపుతున్నారు. బాల్యం నుంచి చిత్రకళపై ఆసక్తిని పెంచుకొని గ్రామంలోనే నిత్య సాధనతో ప్రావీణ్యం పొందుతున్నారు.

★ తాను ఊహించుకున్న రూపాన్ని చేతులతో వస్తువులుగా తీర్చిదిద్దుకున్నారు. ఇత్తడి, రాగి విగ్రహాలతోపాటు శిల్పాలు, ఆలయ ధ్వజ స్తంభాలు, శిఖర కలశాలు, ముఖ తోరణాలు, విగ్రహ కవచాలు, కిరీటాలు, రాగి యంత్రాలు, దర్గాలకు, మొహర్రానికి సంబంధించి ఆభరణాలు తదితర వస్తువులను ఆయన సులువుగా తయారు చేయడంలో దిట్ట. ఈయన చేసినవి పలు విగ్రహాలు రాష్ట్రంలోని ఆయా దేవాలయాల్లో కనిపిస్తాయి.

ప్రత్యేకతలు..

★ ఏపీలోని ప్రముఖ క్షేత్రమైన విజయవాడ కనకదుర్గ ఆలయానికి కిలో వెండితో నవరత్న కిరీటం. ప్రకాశం జిల్లాలోని భైరవకొన త్రిముఖ దుర్గ ఆలయానికి విగ్రహం. చింతపల్లిలోని శిర్డీ సాయిబాబా దేవాలయానికి కిరీటం. రంగారెడ్డి జిల్లా కందుకూరులో మేరిమాతకు వెండి కిరీటం, వెంకటేశ్వరనగర్‌లోని పలు దేవాలయాలకు శివ కవచం ప్రత్యేకంగా తయారు చేసి అందించారు. రేగు గింజ సైజులో ఉన్న వాటిపై ఓ వైపు గణపతి, మరోవైపు లక్ష్మీదేవి విగ్రహాలను చెక్కి పలు దేవాలయాల్లోని విగ్రహాలకు జీవం పోశారు.

- న్యూస్‌టుడే, చింతపల్లి

ఇరువర్గాలకు చెందిన ఎనిమిది మందికి రిమాండ్

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: యాదాద్రి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో కత్తులతో ఓ వర్గం వారు దాడి చేయగా.. మరో వర్గం ప్రతిదాడి చేసిన ఘటనలో మొత్తం ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్, భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ఫర్హాన్, మహ్మద్ షారుఖ్, మహ్మద్ ఖాజా, మినాజ్, అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన అమీర్‌లు కలిసి చౌటుప్పల్ పురపాలిక పరిధిలోని తంగడపల్లికి చెందిన షేక్ నుమాన్‌ని కలవడానికి వచ్చారు. అందరూ కలిసి మద్యం తాగారు. తాగిన మైకంలో కారును దురుసుగా నడుపుతుండటంతో ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నించినందుకు కత్తులతో పొడిచి దాడి చేశారని సుర్కంటి సుధాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో కుమారుడు బాలకృష్ణారెడ్డితో పాటు కౌన్సిలర్ హిమబిందు భర్త దండ అరుణ్‌కుమార్, సుర్వి మహేందర్‌లు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. కాగా.. కారును వేగంగా నడుపుతున్నారని తమని దుర్భాషలాడుతూ దండ అరుణ్‌కుమార్, సుర్కంటి బాలకృష్ణారెడ్డి, సుర్వి మహేందర్‌తో పాటు మరికొంత మంది తమపై దాడి చేశారని తంగడపల్లికి చెందిన నుమాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించి చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మధకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. కత్తులతో దాడి చేసిన ఘటనలో.. షేక్ నుమాన్, మహ్మద్ షారుఖ్, మహ్మద్ ఖాజా, మహ్మద్ మినాజ్‌లను.. దురుసుగా డ్రైవింగ్ చేశారని కారులోని వ్యక్తులను చితకబాదినందుకు చౌటుప్పల్‌కు చెందిన మలిగె నవీన్, మలిగె సంతోష్, మలిగె రవి, మలిగె మహేశ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు.

దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన డీసీపీ

చౌటుప్పల్‌లో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన దాడి ఘటన నేపథ్యంలో డీసీపీ రాజేశ్‌చంద్ర పరిశీలించారు. మంగళవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ సందర్శించారు. ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మధకుమార్, ఎస్సైలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలకు ఆటంకం లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

ఉద్యమకారులుగా గుర్తించండి

వలిగొండ, న్యూస్‌టుడే: రాష్ట్రం కోసం పోరాటం చేసిన వారిని తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించాలని ఆ సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టోఫర్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. అంజయ్య, మల్లయ్య, స్వామి, బాలయ్య, స్వామి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సహకారం అవసరం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా సంక్షేమ అధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నర్సింహారావును వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు జిల్లా కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. జిల్లాలోని మహిళలు, బాలలు, వృద్ధుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరి సహకారం అవసరమని నర్సింహారావు అన్నారు.

కాలుష్య పరిశ్రమలు ఏర్పాటు చేయొద్దు

రామన్నపేట, న్యూస్‌టుడే: ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే కాలుష్య పరిశ్రమలు రామన్నపేటలో ఏర్పాటు చేయవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ డిమాండ్ చేశారు. రామన్నపేట సమీపంలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలాన్ని మంగళవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. మేక అశోక్‌రెడ్డి, జల్లెల పెంటయ్య, వెంకటేశం, ఉపేందర్, కూరెళ్ల నర్సింహచారి, ఆనంద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం... ప్రజలకు శాపం


వలిగొండ: మల్లేపల్లిలో అపరిశుభ్రంగా మురుగు కాల్వలు

వలిగొండ, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల నిర్లక్ష్యం, అశ్రద్ధ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. మురుగు కాల్వలు, పరిసరాల శుభ్రత కనుమరుగు అవడంతో దోమల తీవ్రత పెరిగింది. ప్రజలు మలేరియా, డెంగీ లక్షణాలతో ప్రజలు సతమతమవుతున్నారు. అసలే పేదవారు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే రోగాలు విజృంభించడంతో ఆసుపత్రులకు వెళ్లి చికిత్స తీసుకోలేక అవస్థలు పడుతున్నారు. వలిగొండ, మల్లేపల్లి వేములకొండ, చిత్తాపురం, గోపరాజుపల్లి, తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదని ఆయా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మల్లేపల్లిలో 12 మందికి డెంగీ లక్షణాలు

వలిగొండ మండల గ్రామం మల్లేపల్లిలో భూగర్భ మురుగు కాల్వలు నిర్మించినప్పటికీ నాయకుల అండతో కొంత మంది భూగర్భ మురుగు కాల్వల తవ్వడం తోనే మురుగు బయటకు వెళ్లని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దోమల స్వైర విహారం చేస్తుండటంతో 12 మంది డెంగీ, వైరల్ ఫీవర్ బారిన పడ్డారని ప్రజలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగు కాల్వలు, పరిసరాలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగు తొలగింపు పనులు చేపడతాం:

జితేందర్‌రెడ్డి, ఎంపీడీవో, వలిగొండ

మల్లేపల్లిలో మురుగు కాల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తాం. పంచాయతీ సిబ్బందితో మురుగు తొలగింపు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తాం.

శిథిలావస్థలో శీతలీకరణ కేంద్రం


చౌటుప్పల్‌లో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్రం భవనం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లోని పాల శీతలీకరణ కేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారడంతో భయంగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పాల ఉత్పత్తిదారులు, సొసైటీల అధ్యక్షులు, కార్యదర్శులు ఇక్కడికి వచ్చిపోతుంటారు. ఎప్పుడు కూలుతుందో అని భయపడుతున్నారు. ఈ భవనాన్ని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించారు. ఇరవయ్యేళ్ల పాటు చెరువు నిండకపోవడంతో ఇక్కడ నిర్మించారు. 2005లో కుండపోతగా కురవడంతో చెరువు నిండి భవనం జలమయమైంది. 2021లోనూ అదే పరిస్థితి ఏర్పడింది. కేంద్రం లోపలికి వెళ్లేందుకు సైతం అవకాశం లేకపోవడంతో మూసివేశారు. అధికారుల సూచనతో భవనం చుట్టూ మట్టిని నింపి చదును చేశారు. యంత్రాలను వరండాలోకి మార్చారు. చాలా కాలం నీళ్లలో ఉండడంతో భవనం కూలే స్థితికి చేరుకుందని ఆందోళన చెందుతున్నారు.


పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న పైకప్పు

29 గ్రామాల నుంచి పాలు సేకరిస్తున్నాం..



– సీహెచ్ వెంకటరెడ్డి, మేనేజర్, పాలశీతలీకరణ కేంద్రం, చౌటుప్పల్

చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి మండలాల్లోని 29 గ్రామాల రైతుల నుంచి రోజుకు 2300 లీటర్ల పాలను సేకరించి ఈ శీతలీకరణ కేంద్రం ద్వారా మదర్‌డైరీకి సరఫరా చేస్తున్నాం. భవనం శిథిలావస్థలో ఉంది. వర్షం కురిసి చెరువు నిండినప్పుడల్లా మురుగు సమస్య ఏర్పడుతుంది. నూతన నిర్మాణానికి 'నార్మూల్'కు గతంలోనే ప్రతిపాదనలు పంపారు.

రాయితీపై పాడి గేదెలివ్వాలి..



– జంగయ్య, అధ్యక్షుడు, జనగాం పాల ఉత్పత్తిదారుల సొసైటీ

గ్రామంలోని సొసైటీ నుంచి 150 లీటర్ల పాలను శీతలీకరణ కేంద్రానికి పంపుతున్నాం. గతంలో పదిహేను రోజులకు ఒక పర్యాయం బిల్లులు మంజూరు చేసేవారు. దాదాపు రెండు నెలలవుతుంది. బిల్లులు రాలేదు. గ్రామంలో గతంలో రైతులకు నలభై పాడి గేదెలు రాయితీపై మంజూరయ్యాయి. ఇప్పుడు కూడా అవసరమైన వారికి ప్రభుత్వం పాడి గేదెలు మంజూరు చేసి ప్రోత్సహించాలి

వర్షంలో తడిసి.. ఆలయ సన్నిధి మెరిసి

యాదాద్రి క్షేత్రంలో ఆకస్మికంగా కురిసిన వర్షం మంగళవారం మధ్యాహ్నం వేళ భక్తులను పరుగులు తీయించింది. ఉక్కపోతకు బదులు చల్లని వాతావరణాన్ని కల్పించింది. ఆలయ గోపురాలు, దారులు తడిసిపోయాయి. పంచనారసింహుల ఆలయ సన్నిధి, అష్టభుజి మండప ప్రాకారాలు, గోపురాలు కృష్ణశిల సహజత్వంతో మెరుస్తూ భక్త జనులను కనువిందు గొల్పాయి. – యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే


వర్షంలో యాదాద్రి ఆలయ సన్నిధి

మృతుల కుటుంబాలకు పరామర్శ

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, కొండంపేటకు చెందిన మాజీ ఉపసర్పంచి అలకుంట్ల ఉప్పలయ్య భార్య మల్లమ్మ ఇటీవల మృతిచెందారు. ఆయా మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మంగళవారం పరామర్శించి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, పొన్నాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరుకు చెందిన పురోహితుడు పాలకుర్తి వెంకటరమణశర్మ ఇటీవలే మృతిచెందగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ వారి ఇంటికి వెళ్లి వెంకటరమణ శర్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. భారాస నాయకుడు మొరిగాల శ్రీను అనారోగ్యానికి గురికాగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

విద్యార్థుల్లో వైకల్యాలు గుర్తించండి

తుర్కపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో వివిధ రకాలైన వైకల్యాలను ఉపాధ్యాయులు గుర్తించాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, జిల్లా సెక్టోరియల్ అధికారి లింగారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రశస్త్ యాప్ కార్యక్రమంపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ప్రశస్త్ యాప్‌కు సంబంధించి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మండల నోడల్ అధికారి మహదేవరెడ్డి మంగళవారం నిర్వహించారు. మండల రీసోర్స్ పర్సన్లు చిత్తరంజన్, బాలరాజు పాల్గొన్నారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని భీమనపల్లిలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే పట్టుకోవాలని మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో దళిత సంఘాలు, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మీసాల గణేష్, దుబ్బ రామకృష్ణ, నల్ల లక్ష్మణ్, పాక వెంకటేశం, కందాడి భూపాల్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి

'స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం'

రామన్నపేట, న్యూస్‌టుడే: ఎన్నికల హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు తగిన గుణపాఠం చెప్తారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. రామన్నపేటలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ప్రజల దృష్టి మరలించేందుకు హైడ్రా డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు సాల్వేరు అశోక్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పోచబోయిన మల్లేశం, మండల మాజీ అధ్యక్షుడు బందెల రాములు, బొక్క మాధవరెడ్డి, పున్న వెంకటేశం, జాడ సంతోశ్, మిర్యాల మల్లేశ్, ఆవుల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీరు అందించాలి: అదనపు కలెక్టర్

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఉద్యోగినని కాకుండా ప్రజలకు సేవ చేస్తున్నామనే భావనతో విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గంగాధర్ కోరారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. నాణ్యమైన నీటిని, సరైన సమయంలో సరఫరా చేసేలా గ్రామ మంచినీటి సహాయకులకు ఇక్కడ శిక్షణనివ్వనున్నట్టు తెలిపారు. మిషన్ భగీరథ (ఇంట్రా) ఈఈ పి.కరుణాకరన్, రీసోర్స్ పర్సన్లు రామనర్సయ్య, మల్లయ్య, మిషన్ భగీరథ ఈఈ లక్ష్మీనారాయణ, డీఈ దీనదయాళ్‌రావు, డీఎల్‌పీవో ప్రతాప్‌నాయక్, ఎంపీవో అంజిరెడ్డి, ఏఈ వి.విశాల్‌రెడ్డి పాల్గొన్నారు.


చౌటుప్పల్‌లో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గంగాధర్

భూ సమస్యలు పరిష్కరించండి

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: భూ సమస్యలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ధరణికి సంబంధించి అంతర్జాలంలో నమోదు చేసిన వివరాలతో పాటు కార్యాలయంలోని దస్త్రాలను పరిశీలించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, నాయబ్ తహసీల్దార్ సఫీయొద్దీన్, ఆర్‌ఐ మల్లిఖార్జున్‌రావు ఉన్నారు.


ఆత్మకూరు(ఎం)లో దస్త్రాలను పరిశీలిస్తున్న జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

చెరువులో పడి యువకుడి బలవన్మరణం

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణంలోని తాతానగర్ చెందిన యువకుడు చెరువులో పడి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాతానగర్ కాలనీకి చెందిన ముదిగొండ రాజ్‌కమల్ (23) స్థానికంగా ఓ ఎలక్ట్రానిక్ దుకాణంలో పని చేస్తున్నాడు. మృతుడి నానమ్మకు ఆదివారం ఇంట్లో పిండ ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా జరిగిన చిన్నపాటి గొడవ కారణంగా మనస్తాపంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం శవం కనిపించడంతో స్థానికులు పోలీసులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పంచనామా నిర్వహించారు. మృతుడి తల్లి, ఒక సోదరి ఉన్నారు. తండ్రి గతంలోనే చనిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు.

విద్యార్థులు, యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ఆలేరు, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువత సేవాభావాన్ని అలవర్చుకుంటూ దేశసేవలో భాగస్వాములు కావాలని ఆలేరు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు డా.జె.రాజారామ్, పూజారి వెంకటేశ్వర్లు అన్నారు. ఆయా కళాశాలల్లో మంగళవారం జరిగిన ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవ కార్యక్రమాల్లో మాట్లాడారు. అధికారులు డా.ఎన్.ముత్యాలు, జూకంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భువనగిరి నేరవిభాగం: జాతీయ సేవా పథకం ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులు శుభ్రం చేశారు. ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు స్నేహలత, కిష్టయ్య పాల్గొన్నారు.


ఆలేరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ

యాదగిరిగుట్ట పట్టణం: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మంజుల, అధికారి రాంబాబు మాట్లాడారు.

బీబీనగర్: బీబీనగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక శిక్షణ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నిరూప, వైస్ ప్రిన్సిపల్ రూప, శ్రీలత, పావని, స్రవంతి పాల్గొన్నారు.

మోత్కూరు: ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రభ జస్టిస్ మాట్లాడారు. కె.నర్సింహారెడ్డి, బి.పురుషోత్తంరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

భువనగిరి నేరవిభాగం: భువనగిరి జూనియర్ కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, వ్యర్థాలను విద్యార్థులు తొలగించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పాపిరెడ్డి, ఎ.నర్సింహ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయండి

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: గ్రామగ్రామాన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని భాజపా జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని దంతూరులో ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో జరుగుతున్న సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కర్నాటి ధనంజయ్య, ఎన్నం శివకుమార్, గుండ్ల రాజు, వెంకటేశం, శ్రీనివాస్, చొక్కారెడ్డి, బస్వయ్య, రవీందర్ పాల్గొన్నారు.


దంతూరులో భాజపా సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

భువనగిరి గ్రామీణం: మండలంలోని గంగసానిపల్లిలో భాజపా సభ్యత్వ నమోదును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు చీర్క సురేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బబ్బూరి సురశ్‌గౌడ్, నాయకులు శంకర్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది మృతదేహం ఎయిమ్స్‌కు అప్పగింత

రామన్నపేట, న్యూస్‌టుడే: సీనియర్ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుడు మండలంలోని శోభనాద్రిపురం గ్రామానికి చెందిన బొడిగె లక్ష్మయ్య(77) అనారోగ్యంతో సోమవారం రాత్రి హైదరాబాదులో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రామన్నపేటలో కోర్టు ప్రారంభించిన ప్పటి నుంచి నాలుగు దశాబ్దాలకు పైగా న్యాయవాద వృత్తిలో కొనసాగారు. ఈయన సుదీర్ఘకాలం పాటు సీపీఎంలో కొనసాగారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి.జహంగీర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, ఈయన చివరి కోరిక మేరకు ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, తదితరులు లక్ష్మయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. మృతదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు అప్పగించారు.


బొడిగె లక్ష్మయ్య

మృతికి విచారం

బీబీనగర్: తెలంగాణ ఉద్యమకారులు బొడిగె లక్ష్మయ్య మృతికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొలుపుల వివేకానంద విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి మంగళవారం బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రి దగ్గర టీడబ్ల్యూజేఎఫ్ సభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల జలందర్, నాగాచారి, వెంకటేశం పాల్గొన్నారు.

నిందితుని రిమాండ్

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: భువనగిరి మండలంలో మానసిక వికలాంగురాలైన మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు జమ్ముల మధును మంగళవారం అరెస్ట్ చేసినట్లు గ్రామీణ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. అతన్ని కోర్టులో హాజరు పరిచామన్నారు.

ఐదుగురికి గాయాలు

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వీరవెల్లి గ్రామ శివారు వద్ద కారు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలైనట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. వలిగొండ మండల పులిగిల్లకు చెందిన వేముల రాజు తన ప్యాసింజర్ ఆటోలో మంగళవారం సాయంత్రం ఆటోలో వెళ్తుండగా వీరవల్లి గ్రామం శివారులో వెనకాల నుంచి కారు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొనడంతో ఆటో పొలంలో పల్టీకొట్టిందని తెలిపారు. దీంతో ఆటో నడుపుతున్న రాజుకు తీవ్ర గాయాలు కాగా అందులో ప్రయాణిస్తున్న మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. గాయపడిన రాజును జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అవీ ఇవీ


జూకంటి బాబు

నియామకం.. ఆలేరు: తెలంగాణ శరీర అవయవ దాతల సంఘం జిల్లా కన్వీనర్‌గా మండలంలోని టంగుటూరుకు చెందిన జూకంటి బాబు మంగళవారం నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం కన్వీనర్, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్, ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డా.జి.సీతామహాలక్ష్మి హైదరాబాదులోని రవీంద్రభారతిలో నియామక పత్రాన్ని అందజేశారు.

కాంగ్రెస్ శ్రేణులకు సన్మానం.. సంస్థాన్‌నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనుతో పాటు జిల్లా కమిటీలో చోటు దక్కించుకున్న పలువురిని మంగళవారం మండల కేంద్రంలో సన్మానించారు.

ప్రతిభ... వలిగొండ: మండలంలో టేకుల సోమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలబాలికలు మండల స్థాయి ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. అండర్-17 కబడ్డీ బాలికల విభాగం, అండర్- 14 బాలుర విభాగంలో మండల ప్రథమ స్థాయిలో గెలిచినట్లు పీడీ మల్లేశం తెలిపారు.

పంటల పరిశీలన.. రామన్నపేట: మండలంలోని కొమ్మాయిగూడెం, రామన్నపేట గ్రామాల్లో ఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరవాక కేంద్రం శాస్త్రవేత్తలు పత్తి, వరి పంటలను మంగళవారం పరిశీలించారు. డాక్టరు బి.అనిల్‌కుమార్, కె.మమత, ఎజాజ్‌అలిఖాన్, కిరణ్ పాల్గొన్నారు.

నిరసన.. మోటకొండూరు: వికారాబాద్ జిల్లా దామగుండం అడవులను కాపాడాలని మండల కేంద్రంలో వివిధ సంఘాల నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. రచయిత చిన్నయ్య, శేఖర్‌రెడ్డి, ప్రవీణ్, మొగులయ్య పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో నష్టం.. భువనగిరి గంజ్: ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతో సరైన పాలన అందించడంలో ప్రజలకు నష్టం కలుగుతుందని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. భువనగిరి పట్టణంలోని రాంనగర్ కాలనీ మహా సభ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీ మహాసభ కార్యదర్శిగా బందెల ఎల్లయ్యను ఎన్నుకున్నారు. గంధమల్ల మాతయ్య, వనం రాజు, మేడబోయిన జంగయ్య పాల్గొన్నారు.

డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్.. తుర్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి కాటం అయిలేష్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడియాల అహోక్, ప్రధాన కార్యదర్శిగా పాండరి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శులుగా రాజమల్లేష్, చంద్రయ్య, సభ్యులుగా నాగరాజు, వెంకటేశం, శంకరయ్య, రాంరెడ్డి, రమేశ్‌లు ఎన్నికయ్యారు.

చల్లదనం కోసం పెయింటింగ్.. యాదగిరిగుట్ట: ఎండ ప్రభావంతో కాళ్లు కాలకుండా చల్లదనం కోసం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాడవీధిల్లో ప్రత్యేక పెయింట్ వేసే పనులు మళ్లీ చేపట్టింది. దైవ దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎండ ప్రభావంతో నడిచేప్పుడు కాళ్లు కాలకుండా ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థినికి గాయాలు.. భువనగిరి గంజ్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో పక్కన ఉన్న గిరిజన బాలికల వసతి గృహ ఆవరణలో మంగళవారం ఓ విద్యార్థిని శునకం దాడి చేసి కరిచింది. చేతికి గాయాలయ్యాయి. వసతి గృహం వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గతంలో శునకాలు గురించి చెప్పినా పట్టించుకోవడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం..గుండాల: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎండీ.షామీమ్ అన్నారు. మంగళవారం మండలంలోని నూనెగూడెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రేణుక, రమ్య, మానస పాల్గొన్నారు.

ఎన్నిక.. భువనగిరి గ్రామీణం: పీఆర్‌టీయూ-టీఎస్ భువనగిరి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సురేంద్ర మోహన్, పి.ఇస్తారి ఎన్నికయ్యారు. జిల్లా పెన్షనర్స్ భవనంలో కె.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికలు జరిగాయి. నిచ్చారు. అసోసియేట్‌గా పి.రమేశ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వై.శోభ, ఉపాధ్యక్షుడిగా రామచంద్రం, మహిళా కార్యదర్శిగా సి.స్రవంతి, కార్యదర్శిగా కనకయ్య ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు జాలిగం రామ్మోహన్‌రావు, వెంకటయ్య, ఉపేందర్‌రావు, సోమరాజు పాల్గొన్నారు.

రామన్నపేట: పీఆర్‌టీయూ టీఎస్ మండల కమిటీ ఎన్నికలు రామన్నపేటలో మంగళవారం జరిగాయి. అధ్యక్షుడిగా కె.లింగాచారి, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ రహీం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు మాధవరెడ్డి, బిక్కు నాయక్ తెలిపారు.

మొక్కల అందజేత..భువనగిరి పట్టణం: అర్బన్ కాలనీ, రాయగిరిలో పుర ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు ఇంటింటి మొక్కలను మంగళవారం అందజేశారు. కడారి ఉమాదేవి, అరుణ, యాదగిరి, ఎండీ పసియుద్దీన్, రాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం...భువనగిరి నేరవిభాగం: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 5వ విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భువనగిరి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రామానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 వరకు వెబ్‌సైటు https:///iti.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా సతీష్...బీబీనగర్: సీపీఎం బీబీనగర్ పట్టణ కార్యదర్శిగా వల్దాసు సతీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీబీనగర్ పట్టణ 7వ మహాసభలో సతీష్ కుమార్‌ను ఎన్నుకున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు.

అభినందన.. చౌటుప్పల్: గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన చిలుకా మధుసూదన్‌రెడ్డిని ఆయన నివాసంలో యువజన కాంగ్రెస్ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, చౌటుప్పల్ మండల నాయకుడు లింగస్వామిలు మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

స్వచ్ఛత కాపాడుతామని ప్రతిజ్ఞ

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లో పురపాలిక ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. స్థానిక గణేశ్‌నగర్‌లో ఇళ్ల పరిసరాల్లో చెత్త వేయడం వల్ల కలిగే కష్టనష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నూనె మిల్లు వద్ద పడవేసిన చెత్తా చెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు. మల్లికార్జున స్కూలులో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 'ఎస్‌హెచ్‌ఎస్' ఆకారంలో విద్యార్థులు నిల్చొని తాము చెత్తను పరిసరాల్లో వేయబోమని ప్రతిజ్ఞ చేశారు. జాతీయ రహదారి పక్కన ప్లాస్టిక్ సంచుల్లో చెత్త మూటగట్టుకుని పడవేస్తున్న వ్యక్తిని పూలమాలతో సన్మానించారు. వార్డు కౌన్సిలర్ సందగళ్ల విజయ, ధనమ్మ, సునిత, పర్యావరణ ఇంజినీర్ రేణుకుమార్, హనుమాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.


చౌటుప్పల్‌లో 'స్వచ్ఛతా హీ సేవా' ఆకారంలో నిలబడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రాజపేట: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం ప్రదర్శన చేపట్టారు. ఎంపీడీవో నాగవేణి, వైద్యాధికారి భరత్‌కుమార్, ఎంపీవో కిషన్, పంచాయతీ కార్యదర్శి గాంధీ, జానకిరాములు పాల్గొన్నారు.

రుణమాఫీకి కుటుంబ నిర్ధారణ

ఆలేరు, న్యూస్‌టుడే: తెల్ల రేషన్‌కార్డు లేనివారు పంట రుణాల మాఫీకి కుటుంబ నిర్ధారణ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాస్‌గౌడ్ రైతులకు విజ్ఞప్తి చేశారు. మండలంలో వ్యవసాయశాఖ పరంగా చేపట్టిన కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని మంగళవారం శారాజీపేట, పటేలుగూడెం, కొలనుపాక రైతు వేదికలో పరిశీలించి మాట్లాడారు. ఏఈవోలు జూకంటి శివకుమార్, నాగార్జున, స్నేహ, రైతులు పాల్గొన్నారు.


కుటుంబ నిర్ధారణను పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాస్‌గౌడ్

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

రామన్నపేట, న్యూస్‌టుడే: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చునని రామన్నపేట సీఐ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. కక్కిరేణిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో దాతల సహకారంలో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. హెచ్ఎం. హనుమంతరావు, ఎస్సై పి.మల్లయ్య, వేముల సైదులు, తదితరులు పాల్గొన్నారు. దాతలు ప్రభావతి, రామకృష్ణ, పిట్ట రాంరెడ్డి, పిట్ట కృష్ణారెడ్డి, జగన్‌లను సన్మానించారు.


కక్కిరేణిలో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ ఎన్.వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయుల నిరసన

తుర్కపల్లి: మండల కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయ సంఘాలు నిరసనకు దిగాయి. జీవో 25ను అమలు చేయాలని కలెక్టర్లను ఆదేశించడాన్ని తీవ్రంగా ఖండించారు. రేషనలైజేషన్ (జీవో 25) నిబంధనలను వెంటనే మార్చాలని, సర్దుబాటు చర్యలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్, టీఎస్‌యూటీఎఫ్, డీటీఎఫ్, టీయూపీఎస్ నాయకులు రవీందర్, సంపత్‌కుమార్‌రెడ్డి, పరమేశ్, శ్రీశైలం, సత్యనారాయణ పాల్గొన్నారు.


తుర్కపల్లిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు: భారాస

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వ కాలంలో చేపట్టిన పనులను, పథకాలను చూపి తామే చేస్తున్నట్లుగా గొప్పలు పోవడం సిగ్గుచేటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ ఇమ్మడి రాంచంద్రారెడ్డి విమర్శించారు. మంగళవారం యాదగిరిగుట్టలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు పాపట్ల నరహరి, స్వామి, బీరయ్య, నర్సింహ, వీరేశం, చంద్రం, దావూద్, క్రాంతి, రాజు, రమేశ్, వాసు, రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.